సాక్షి శ్రీకాకుళం

గురువారం । 27 । ఏప్రిల్ । 2023



వేర్వేరు ఘటనల్లో..

జిల్లాలోని వేర్వేరు ఘటనల్లో ముగ్గురు మృతి చెందారు. ఆయా ప్రాంతాల్లో విషాదం అలముకుంది. - 8లో



శాస్త్రీయ కోణంలో దర్యాప్తు..

కేసులను శాస్త్రీయ కోణంలో దర్యాప్తు చేయాలని ఎస్పీ సూచించారు. దీనిపై ఆమె సమీక్ష నిర్వహించారు. - 8లో



మండలం	గరిష్ఠం	కనిష్ఠం
ఆమదాలవలస	35°	24°
ఇచ్ఛాపురం	35°	23°
పాతపట్నం	35°	23°
శ్రీకాకుళం	34°	23°

న్యూస్‌రీల్

వాసుదేవుని సన్నిధిలో జొన్నవిత్తుల



వాసుదేవుని విశిష్టతను జొన్నవిత్తులకు వివరిస్తున్న అర్చకులు

మందస: ప్రముఖ సాహితీవేత్త, రచయిత, అవధాని జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు బుధవారం మందస పట్టణంలోని శ్రీవాసుదేవుడిని దర్శించుకున్నారు. ఆలయ సంప్రదాయాలతో ప్రధాన అర్చకులు గోపినంబాళ్ల దాసుకూర్మాచార్యులు, సచ్చిదానందపాఢి జొన్నవిత్తులను ఆహ్వానించారు. ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు చేసి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం అర్చకులు ఆలయ విశిష్టత, పునఃనిర్మాణం, చరిత్ర ఆయనకు వివరించారు.

బదిలీపై జిల్లాకు ముగ్గురు డీఎస్పీల రాక

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాకు ముగ్గురు డీఎస్పీలు బదిలీపై వస్తున్నట్లు రాష్ట్ర డీజీపీ కేవీ రాజేంద్రనాథ్ రెడ్డి ఉత్తర్వులు జారీచేశారు. శ్రీకాకుళం, టెక్కలి, కాశీబుగ్గ సబ్ డివిజన్లకు వై.శృతి (ప్రస్తుతం ఆత్మకూరు), డి.బాలచంద్రరెడ్డి (రామచంద్రపురం), జి.నాగేశ్వరరెడ్డి (నందిగామ)లు వస్తున్నట్లు ఈ ఉత్తర్వుల్లో ఉన్నాయి. కాశీబుగ్గ డీఎస్పీగా ఉన్న ఎం.శివరామరెడ్డి పదోన్నతిపై విశాఖపట్నం నార్త్ ఏసీపీగా బదిలీపై వెళ్లనున్నారు.

'ఏపీ పీ సెట్ సద్వినియోగం చేసుకోండి'

ఎచ్చెర్ల క్యాంపస్: రాష్ట్రంలో విశ్వవిద్యాలయాలు, అనుబంధ కళాశాల్లో నిర్వహిస్తున్న వ్యాయామ విద్యా కోర్సులు బీపీఈడీ, డీపీఈడీల ప్రవేశాలకు సంబంధించిన ఏపీ పీ సెట్–2023 ఆసక్తి గల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ఎం. శ్రీనివాసరావు తెలిపారు. వర్సిటీలో ఆయన మాట్లాడుతూ ఈ సారి పీసెట్‌ను ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నిర్వహిస్తోందని అన్నారు. మే 10వ తేదీలోపు ఎలాంటి అదనపు రుసుం లేకుండా దరఖాస్తులు స్వీకరణ సాగుతుందని చెప్పారు. అదనపు రుసుంతో ఈ నెల 24 వరకు దరఖాస్తుల స్వీకరణ సాగుతుందని అన్నారు. మే 25న దరఖాస్తు పునర్ పరిశీలనకు అవకాశం ఉంటుందని తెలిపారు. హాల్ టిక్కెట్లు మే 27 నుంచి అందుబాటులో ఉంటాయని అన్నారు. పీసెట్ పరీక్ష మే 31న ఉంటుందని అన్నారు. విద్యార్థులు పూర్తి వివరాలకు వెబ్‌సైట్ హెచ్‌టీటీపీ:డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.సీఈటీఎస్.ఏపీఎస్‌సీహెచ్‌ఈ.ఏపీ.జీవోవీ.ఐఎన్‌ను సంప్రదించాలని అన్నారు.


'విద్యార్థుల్లో సాంకేతిక ప్రగతిపై పట్టు అవసరం'



వెబ్‌సైట్ ప్రారంభిస్తున్న ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ పెద్దాడ జగదీశ్వరరావు

ఎచ్చెర్ల క్యాంపస్: విద్యార్థుల్లో సాంకేతిక ప్రగతిపై పట్టు అవసరమని శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ట్రిపుల్ ఐటీ) క్యాంపస్ డైరెక్టర్ ప్రొఫెసర్ పెద్దాడ జగదీశ్వరరావు అన్నారు. వర్సిటీ క్యాంపస్‌లో బుధవారం సీఎస్ఈ విభాగం ఆధ్వర్యంలో 28, 29, 30 తేదీల్లో నిర్వహించనున్న సమ్మేథన్ టెక్నికల్ ఫెస్ట్ వెబ్‌సైట్‌ను బుధవా రం డైరెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఈ ఫెస్ట్‌లో టెక్నికల్, నాన్ టెక్నికల్ అంశాల్లో పోటీలు నిర్వహిస్తామన్నారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని విజ్ఞానాన్ని పెంచుకోవాలని సూచించారు. ఎస్‌పిఎం వీఈడీహెచ్ఏఎస్.ఆర్‌జీయూకేటీఎస్‌కేఎల్ఎం.ఏసీ.ఐఎన్ వెబ్‌సైట్‌లో విద్యార్థుల ఆవిష్కరణలు, ఆలోచనలు పొందుపర్చనున్నట్లు తెలిపారు. ప్రతి విద్యార్థికి తాను చదువుతున్న బ్రాంచ్‌పై పట్టు, విషయ పరిజ్ఞానం ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఓఎస్‌డీ ప్రొఫెసర్ ఎల్. సుధాకర్‌బాబు, పరిపాలన అధికారి ముని రామకృష్ణ, అకడమిక్ డీన్ కొర్ల మోహన్ కృష్ణ చౌదిరి, ఫైనాన్స్ అధికారి డాక్టర్ ఆసిరి నాయుడు, సీఎస్ఈ విభాగాధిపతి రమేష్, అసోసియేట్ డీన్‌లు రమణ, రవి, పీఆర్‌ఓ మామిడి షణ్ముఖ పాల్గొన్నారు.

సీనియర్ ఇంటర్ 64% జూనియర్ 51%



ఇంటర్మీడియెట్ పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

- ప్రథమ, ద్వితీయ ఇంటర్మీడియెట్ ఫలితాల్లో 11వ స్థానంలో సిక్కోలు
- బాలుర కంటే బాలికలే బెస్ట్
- సత్తా చాటిన ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు

శ్రీకాకుళం న్యూకాలనీ: ఇంటర్మీడియెట్ ఫలితాల్లో సిక్కోలు మెరుగుపడింది. బుధవారం వెలువడిన ఫలితాల్లో శ్రీకాకుళం జిల్లా విద్యార్థులు గత ఏడాదితో పోలిస్తే మెరుగైన ఫలితాలు నమోదు చేశారు. గత ఏడాది 57శాతం ఉత్తీర్ణతను సాధించగా ఈ ఏడాది అది 64 శాతానికి పెరిగింది. ఎప్పటిలాగే ఈసారి కూడా బాలురు కంటే బాలికలే పైచేయి సాధించారు. ఇంటర్ పరీక్షలు మార్చి 15 నుంచి ఏప్రిల్ 3వ తేదీ వరకు జరగగా, స్పాట్ వాల్యుయేషన్ ఏప్రిల్ 1 నుంచి 18వ తేదీ వరకు కొనసాగింది. పరీక్షలు ముగిసిన 24 రోజుల్లోనే ఫలితాలను రాష్ట్ర ప్రభుత్వం వెలువరించడం విశేషం.

రెండింటా 11వ స్థానమే..

ఇంటర్మీడియెట్ ఫలితాల్లో సీనియర్స్, జూనియర్స్ ఫలితాల్లోనూ శ్రీకాకుళం జిల్లా 11వ స్థానంతో సరిపెట్టుకుంది. అయితే ఒకేషనల్‌లో మాత్రం ముందు వరుసలో నిలిచింది. జిల్లా విద్యార్థులు ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో 64 శాతం, ప్రథమ సంవత్సరం ఫలితాల్లో 51 శాతం ఉత్తీర్ణత సాధించారు.


సర్కారీ కాలేజీ సో బెటర్..

ప్రైవేటు కళాశాలల కంటే ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించి శభాష్ అనిపించారు. ప్రభుత్వం తీసుకున్నవినూత్నమైన చర్యలతోపాటు ప్రిన్సిపాళ్లు, లెక్చరర్లు సమష్టిగా పనిచేసి మంచి ఫలితాలు సాధించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన కళాశాలల ప్రిన్సిపాళ్లు, విద్యార్థులను ఇంటర్మీడియెట్ విద్య డీవీఈఓ కోట ప్రకాశరావు అభినందించారు. మెరుగైన ఫలితాలు సాధించడంపై ఆయన సంతోషం వ్యక్తంచేశారు.

ఫలితాలు ఇలా..

- సెకండియర్ జనరల్ కోర్సుల పరీక్షలకు మొత్తం 21,752 మంది విద్యార్థులు హాజరు కాగా 64 శాతం ఉత్తీర్ణతతో 14,019 మంది పాసయ్యారు. ఇందులో 9,839 మంది బాలురు పరీక్షలకు హాజరు కాగా 57 శాతంతో 5,622 మంది పాసయ్యారు. 11,913 మంది బాలికలు పరీక్షలు రాయగా 70 శాతంతో 8,397 మంది ఉత్తీర్ణులయ్యారు. బాలురు కంటే బాలికలు 13 శాతం ముందంజలో నిలిచారు.
- ఫస్టియర్ జనరల్ కోర్సుల పరీక్షలకు 22,775 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 51 శాతం ఉత్తీర్ణతతో 11,516 మంది పాసయ్యారు. ఇందులో 10216 మంది బాలురుకుగాను 43 శాతంతో 4397 మంది ఉత్తీర్ణులు కాగా, 12559 మంది బాలికలకుగాను 57 శాతంతో 7119 మంది ఉత్తీర్ణులయ్యారు.

గత 8 ఏళ్లుగా సీనియర్ ఇంటర్ ఫలితాలు



- ఇంటర్మీడియెట్ ఫలితాల్లో జిల్లాకు చెందిన పలువురు విద్యార్థులు సత్తాచాటారు.



జ్యోతిభాస్కర్

- సెకెండియర్ ఫలితాల్లో ఎంపీసీ గ్రూపులో శ్రీకాకుళం రూరల్ పరిధిలోని కిల్లిపాలెంకు చెందిన రెడ్డి జ్యోతి భాస్కర్ జిల్లా టాపర్‌గా నిలిచాడు. శ్రీకాకుళం శ్రీచైతన్య కళాశాలలో చదివిన జ్యోతిభాస్కర్ 1000 మార్కులకు గాను 990 మార్కులు సాధించాడు.



జామి ఈక్షిత



లహరి

- ఎంపీసీ గ్రూపు నుంచే అరసవల్లికి చెందిన జామి ఈక్షిత 989 మార్కులు, పొట్నూరు లహరి 989 మార్కులు సాధించి ద్వితీయ స్థానాల్లో నిలిచారు. వీరు ముగ్గురు శ్రీకాకుళం శ్రీచైతన్య విద్యార్థులే. అలాగే ఎస్ఆర్ ఎడ్యుకేషనల్ అకాడమీ నుంచి ఎస్.అమిత్ 986 మార్కులు, ఎం.సమీర 985, అల్లు హోహిణి 984 మార్కులు సాధించి మెరిశారు.



ఆకుల శరణ్య

- ద్వితీయ సంవత్సరం బైపీసీ గ్రూపు నుంచి వజ్రపుకొత్తూరు మండలం మంచినీళ్లపేట గ్రామానికి చెందిన ఆకు శరణ్య జిల్లా టాపర్‌గా నిలిచింది. 1000 మార్కులకు గాను 987 మార్కులు సాధించింది. పలాస–కాశీబుగ్గ పట్టణంలోని సూర్యతేజ విద్యా సంస్థల్లో చదివింది.



ఎ.లాస్యప్రియ

- శ్రీకాకుళం నగరానికి చెందిన అనాల లాస్య ప్రియ బైపీసీలో 984 మార్కులు తెచ్చుకుంది.



డి.ప్రేమ్‌చరణ్



బరాటం వైష్ణవి

- ప్రథమ సంవత్సరంలో ఎంపీసీ గ్రూపు నుంచి 470 మార్కులకుగాను శ్రీకాకుళం నగరానికి చెందిన డి.ప్రేమ్‌చరణ్ 465 మార్కులు, బరాటం వైష్ణవి 465 మార్కులు సాధించి జిల్లా టాపర్లుగా నిలిచారు.



కానూరు తేజ



పల్ల ప్రవల్లిక

- ఆ తర్వాత స్థానాల్లో వరుసగా కానూరు తేజ 464 మార్కులు, పల్ల ప్రవల్లిక 464 మార్కులు, సింగూరు హేమప్రకాష్ 464 మార్కులు, రెడ్డి యుగంధర్ 462, మోహిత్ బెహర 461 మార్కులతో నిలిచారు.
- ప్రథమ సంవత్సరం బైపీసీ గ్రూపు నుంచి 440 మార్కులకుగాను బగాది హేమలత 430 మార్కులు, పొట్నూరు కీర్తి 430 మార్కులతో జిల్లా టాపర్లుగా నిలిచారు.

పిల్లలపై ఆగ్రహం వద్దు: ఎస్పీ

శ్రీకాకుళం క్రైమ్ : ఇంటర్మీడియెట్ పరీక్ష ఫలితాల్లో పిల్లలు అనుకున్నంత మార్కులు సాధించకపోయినా, ఒకవేళ ఫెయిల్ అయినా వారిపై ఆగ్రహించవద్దని ఎస్పీ జీఆర్ రాధిక సూచించారు. బుధవారం ఇంటర్ పరీక్ష ఫలితాలు విడుదలైన నేపథ్యంలో ఎస్పీ మాట్లాడుతూ అనుకున్న ఫలితం రాకపోయినా పిల్లలతో ప్రేమగా వ్యవహరించాలని సూచించారు. క్లిష్టసమయంలో వాళ్లకు మీ అండ అందక వాళ్లు ఆత్మహత్య చేసుకుంటే ఆ కడుపు కోత, అపరాధ భావం ఉండిపోతుందని హెచ్చరించారు. వెన్నుతట్టి ధైర్యం చెప్పాలని సూచించారు.

అరుణాచల గిరి ప్రదక్షిణకు ప్రత్యేక బస్సులు



అరుణాచల గిరి ప్రదక్షిణ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న శ్రీకాకుళం ఆర్టీసీ 1, 2 డిపోల మేనేజర్లు

శ్రీకాకుళం అర్బన్: పౌర్ణమి(మే నెల 5వ తేదీ) సందర్భంగా అరుణాచల గిరి ప్రదక్షిణకు వెళ్లే ప్రయాణికుల కోసం ఐదు రోజుల సత్వర యాత్రను శ్రీకాకుళం జిల్లా ప్రజా రవాణా సంస్థ రూపొందించిందని శ్రీకాకుళం ఆర్టీసీ 1, 2 డిపోల మేనేజర్లు కె.మాధవ్, కేఎస్ఆర్ శర్మలు తెలిపారు. శ్రీకాకుళంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ కార్యాలయంలో మంగళవారం అరుణాచల గిరి ప్రదక్షిణలకు సంబంధించిన కరపత్రాలను శ్రీకాకుళం ఆర్టీసీ 1, 2 డిపోల మేనేజర్లు, సిబ్బంది ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లా నుంచి మే నెల 3వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు బస్సు బయల్దేరి కాణిపాకం, శ్రీపురం దర్శనం చేసుకుని అరుణాచలం వెళ్లి గిరి ప్రదర్శన చేసే అవకాశం కల్పించినట్లు తెలిపారు. తిరుగు ప్రయాణంలో కంచి దర్శనం చేసుకుని మే నెల 7వ తేదీన శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్‌కు ప్రయాణికులను చేరుస్తామన్నారు. ఈ యాత్రకు రాను పోను టికెట్ చార్జీ రూ.4500 నిర్ణయించినట్లు తెలిపారు. ఈ ప్రత్యేక సర్వీసులలో సీట్లను ముందుగా రిజర్వు చేయించుకునే సౌకర్యం కూడా ఉందని పేర్కొన్నారు. శ్రీకాకుళం బస్ స్టేషన్‌లో గల రిజర్వేషన్ కౌంటర్ నందు టిక్కట్లు లభిస్తాయన్నారు. వివరాలకు 7382921647, 9959225608, 7382919696 ఈ ఫోన్ నంబర్లకు సంప్రదించాలని ప్రయాణికులకు విజ్ఞప్తి చేశారు.

నాడు–నేడుపై అలసత్వం వద్దు

శ్రీకాకుళం పాతబస్టాండ్: నాడు–నేడు పనులు జూన్ 1వ తేదీ నాటికి వంద శాతం పూర్తి చేయాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ ఇంజినీర్లను ఆదేశించారు. అలసత్వం వద్దని, అలా చేస్తే చర్యలు ఉంటాయని హెచ్చరించారు. మనబడి నాడు–నేడు రెండో దశ పనులు, మరుగుదొడ్లు, కిచెన్‌లు, తదితర అంశాలపై ఎంఈఓలు, ఇంజినీర్లు, ఏపీఎంలతో జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు–నేడు కింద జిల్లాలో 1096 జూనియర్ కళాశాలలు, పాఠశాలలలో పనులు జరుగుతున్నాయని తెలిపారు. నిధులు అందుబాటులో ఉన్నట్లు చెప్పారు. ఏపీసీ జయ ప్రకాష్ మాట్లాడుతూ సిమెంటుకు సంబంధించి చెల్లింపులు పెండింగ్‌లో లేవన్నారు. కమిటీ కాల పరిమితి పూర్తయిన గ్రామాల్లో గ్రామ సభలు ఏర్పాటు చేసి కోరంలేక ఇక్కడి నాడు–నేడు నిధులు వేరే స్కూల్‌కి వెళుతున్నట్లు గ్రామస్తులకు చెప్పాలన్నారు. సమావేశంలో ఆయా మండలాల ఎంఈఓలు, మండల ఇంజనీర్లు, ఎపిఎంలు, తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా భూ హద్దు..



సర్వే రాళ్ల ఏర్పాటు ప్రక్రియను పరిశీలిస్తున్న సర్వే విభాగం ఏడీ ప్రభాకర రావు, సర్వే అధికారులు

- రీసర్వే పూర్తయిన గ్రామాల్లో ముమ్మరంగా సర్వే రాళ్ల ఏర్పాటు
- జిల్లాలో 354 గ్రామాల్లో రీ సర్వే రాళ్లు ఏర్పాటు చేస్తున్న అధికారులు
- ఇప్పటికే 3,29,542 సర్వే రాళ్లను సమకూర్చిన అధికారులు

టెక్కలి: రాష్ట్ర వ్యాప్తంగా భూ వివాదాలు, ప్రభుత్వ భూముల పరిరక్షణ కోసం ప్రభుత్వం సరికొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టింది. ఎప్పుడో 1956లో రాష్ట్ర వ్యాప్తంగా భూ సర్వే నిర్వహించి హద్దులను కేటాయించారు. ఆ తర్వాత మారుతున్న కాలంతో పాటు హద్దులు చెరిగిపోయి తరచూ భూ వివాదాలు చోటు చేసుకున్నాయి. భూ వివాదాల అంశం అధికారులకు పెద్ద తలనొప్పిగా ఉండేది. భూ సమస్యల పరిష్కారం కోసం రైతులు, యజమానులు అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరిగేవారు. ఇలాంటి సమస్యలన్నింటికీ శాశ్వతమైన పరిష్కారం చూపే విధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సరికొత్త ఆలోచన చేశారు. 'వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు– భూ రక్ష పథకానికి' శ్రీకారం చుట్టారు. మొదటి విడతగా రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 2 వేల గ్రామాల్లో రీ సర్వే ప్రక్రియ పూర్తి చేశారు. ఇందులో భాగంగా జిల్లాలో 354 గ్రామాల్లో రీసర్వే ప్రక్రియ చేపట్టి ఆయా రైతులకు ఎల్‌పీఎం పత్రాలను అందజేశారు. ఇప్పుడు రీసర్వే పూర్తయిన గ్రామాల్లో ఆయా భూముల్లో పక్కాగా హద్దు కేటాయించేందుకు సర్వే రాళ్లను ఏర్పాటు చేస్తున్నారు. జిల్లా, మండల, గ్రామ సచివాలయం పరిధిలో గల సర్వే విభాగానికి చెందిన సిబ్బంది సర్వే రాళ్ల ఏర్పాటులో నిమగ్నమయ్యారు.

354 గ్రామాల్లో..

రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన మోడల్ రీ సర్వేలో భాగంగా జిల్లాలో 354 గ్రామాల్లో సుమారు 1,40,533.74 ఎకరాల్లో రీ సర్వేను పూర్తి చేశారు. రీ సర్వే పూర్తి చేసిన గ్రామాల్లో హద్దులు కేటాయించేందుకు సుమారు 4,48,316 సర్వే రాళ్లు అవసరం కాగా, ఇప్పటికే 3,29,542 సర్వే రాళ్లను సమకూర్చారు. అంతే కాకుండా 90 గ్రామాల్లో సుమారు 25,392.75 ఎకరాల్లో 2,42,115 సర్వే రాళ్లను ఏర్పాటు చేశారు. మే 20 నాటికి పూర్తి స్థాయిలో సర్వే రాళ్లు ఏర్పాటు చేసేందుకు ముమ్మరంగా చర్యలు చేపడుతున్నారు. సర్వే రాళ్ల ఏర్పాటు కోసం జిల్లాకు 94 రోవర్లు కేటాయించారు. ఒక్కో రోవర్ ద్వారా రోజుకు 100 సర్వే రాళ్లు ఏర్పాటు చేసే విధంగా ప్రణాళిక రూపొందించారు.

సర్వే చేసి రాళ్లు పాతారు



నాకు ఉన్న 70 సెంట్ల స్థలంలో అధికారులు సర్వే చేశారు. ఇప్పుడు రాళ్లు పాతారు. సర్వే సక్రమంగానే చేశారు. సర్వేకు, రాళ్లు పాతడానికి ఒక్క రూపాయి కూడా అడగలేదు. ఈ సర్వే వల్ల మాకు హద్దులు బాగా తెలిశాయి.
– పి.చిన్నయ్య, రైతు, రేగులపాడు, కోటబొమ్మాళి మండలం.

వివాదాలకు పరిష్కారం

ప్రభుత్వం తలపెట్టిన రీ సర్వే వల్ల భూ సమస్యలు శాశ్వతంగా పరిష్కారమవుతాయి. అంతే కాకుండా ప్రభుత్వ భూములు పరిరక్షించవచ్చును. జిల్లాలో మోడల్ రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో సర్వే రాళ్లను ఏర్పాటు చేస్తున్నాం. మే 20 లోగా ఈ ప్రక్రియను పూర్తి చేస్తాం.
– ఎం.ప్రభాకరరావు, ఏడీ, జిల్లా సర్వే విభాగం

50,895 మంది విద్యార్థులు.. రూ.47.86 కోట్లు

- జిల్లాలో వసతిదీవెన కింద జమ చేసిన ప్రభుత్వం
- చదువుల భారం ప్రభుత్వమే భరిస్తుందని కలెక్టర్ వెల్లడి



చెక్ అందజేస్తున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: తల్లిదండ్రులపై ఆర్థిక భారం పడకుండా చదువులకు అయ్యే ఖర్చును ప్రభుత్వమే భరిస్తుందని, విద్యార్థులు నిశ్చింతగా చదువుకోవాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అన్నారు. జగనన్న వసతి దీవెన కింద ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాల్లో బుధవారం నగదు జమ చేశారు. జిల్లా కేంద్రంలో వర్చువల్‌గా జరిగిన ఈ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 50,895 మంది విద్యార్థులకు సంబంధించి 45,907 మంది తల్లుల బ్యాంకు ఖాతాల్లో 47.86 కోట్లు జమ చేసినట్లు వివరించారు.

- పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి మాట్లాడుతూ పేదరికం చదువుకు అడ్డుకాకూడదని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విద్యార్థులకు అనేక పథకాలు అమలు చేస్తున్నారని చెప్పారు. విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.
- కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలనే ఉద్దేశంతో నాడు నేడు ద్వారా తొమ్మిది రకాల సౌకర్యాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. బీసీ సంక్షేమాధికారి ఇ.అనూరాధ మాట్లాడుతూ అర్హులందరికీ వసతి దీవెన అమలు చేస్తున్నట్లు తెలిపారు. కళింగ వైశ్య కార్పొరేషన్ అధ్యక్షుడు అంధవరపు సూరిబాబు మాట్లాడుతూ పథకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. అనంతరం నమూనా చెక్కు అందజేశారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఆర్.గడ్డెమ్మ, డీఎల్‌డీఓ వాసుదేవరావు, బీసీ సంక్షేమాధికారి ఇ.అనూరాధ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక భారం కాకుండా..



జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన పథకం వల్ల తల్లితండ్రులకు ఆర్థిక భారం కాకుండా ఉన్నత చదువులు చదవగలుగుతున్నాం. జగనన్న ప్రభుత్వం విద్యారంగానికి ఎంతో ప్రాధాన్యమిస్తోంది. ప్రాథమిక స్థాయి నుంచి విదేశీ విద్య వరకు అన్ని రకాలుగా చేయూతనిస్తోంది. నాడు నేడు ద్వారా వసతులు కల్పించారు. పథకాలను సద్వినియోగం చేసుకుంటున్నాం.
– కరుణ, డిగ్రీ ఫస్టియర్ విద్యార్థిని

చదువులకు సాయం..



జగనన్న ప్రభుత్వం వచ్చిన తర్వాత అన్ని సంక్షేమ పథకాలు అందుతున్నాయి. మా పాప డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతుండటంతో వసతి దీవెన వచ్చింది. బాబు 9వ తరగతి చదువుతుండటంతో అమ్మ ఒడి వర్తిస్తుంది. విద్యాదీవెన, వసతి దీవెనలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. సీఎం జగన్ పిల్లలకు మేనమామలా ఆర్థిక సాయం అందించి ఆదుకుంటున్నారు.
– కరణం సంతోషి, విద్యార్థిని తల్లి, ఇప్పిలి

జలుమూరు తహసీల్దార్ కార్యాలయంలో ఏసీబీ తనిఖీలు



జలుమూరు తహసీల్దార్‌తో మాట్లాడుతున్న ఏసీబీ సీఐ భాస్కరరావు సిబ్బంది

జలుమూరు: ఏసీబీ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తహసీల్దార్, రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో తనిఖీలు నిర్వహించి తుది నివేదిక అందజేస్తామని ఏసీబీ సీఐ కె.భాస్కరరావు అన్నారు. జలుమూరు తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం తనిఖీలు నిర్వహించి ప్రభుత్వ సేవలు అనుకున్న సమయానికి పారదర్శకంగా అందుతున్నాయా లేదా అన్నది పరిశీలన చేశామని తెలిపారు. అనంతరం కొన్ని పెండింగ్ ఫైల్స్ వివరాలు తహసీల్దార్‌తో చర్చించామని చెప్పారు. రాష్ట్ర కార్యాలయానికి 14400 నంబర్‌కు వచ్చిన ఫోన్ ఆధారంగా వివరాలు సేకరించామని చెప్పారు. ఈ సేవలను ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు. ఆయనతోపాటు ఎస్.ఐ సత్యారావు, సిబ్బంది ఉన్నారు.

రక్తహీనత నివారించాలి: కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: గర్భిణులు, పిల్లల్లో రక్తహీనత నివారణకు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ శ్రీకేశ్ బి.లాఠకర్ ఐసీడీఎస్ పీఓలను ఆదేశించారు. మహిళా శిశు సంక్షేమ శాఖ పీఓలతో బుధవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఆయన సమీక్షించారు. రక్తహీనత గల పిల్లలు, గర్భిణులకు క్రమం తప్పకుండా ఫోలిక్ యాసిడ్ మాత్రలు, తదితరమైనవి పంపిణీ చేయాలన్నారు. అంగన్‌వాడీ వర్కర్లు డేటా ఎంట్రీ సరిగా చేయకపోతే సంబంధిత సీడీపీఓపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. అంగన్‌వాడీ వర్కర్లకు డేటా ఎంట్రీపై శిక్షణ ఇవ్వాలని సూచించారు. స్టాక్ సరఫరా చేయని అంగన్‌వాడీ వర్కర్లను సస్పెండ్ చేయాలని స్పష్టం చేశారు. సమావేశంలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఇన్‌చార్జి పీడీ జి. జయదేవి, సీడీపీఓలు, తదితరులు పాల్గొన్నారు.

'డెంగీ కేసులు నమోదు కాలేదు'

కవిటి: ర్యాపిడ్ టెస్ట్ కిట్‌లతో పరీక్షించి డెంగీ నిర్ధారణ చేయడం సరికాదని డీఎంహెచ్ఓ బొడ్డేపల్లి మీనాక్షి అన్నారు. ఆమె బుధవారం మండలంలోని కపాసుకుద్దిలోని రాజపురం పీహెచ్‌సీ సిబ్బంది నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాన్ని సందర్శించారు. ఇక్కడ సేకరించిన నమూనాల ఆధారంగా ఒక్క డెంగీ కేసు కూడా నమోదు కాలేదని తెలిపారు. ర్యాపిడ్ ఫలితాలు ఆధారంగా నిర్ధారణకు రాకోడదన్నారు.

క్లుప్తంగా

29న జిల్లా జూనియర్స్ సాఫ్ట్‌బాల్ జట్ల ఎంపిక

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా జూనియర్స్ బాల బాలికల జట్ల ఎంపికలు ఈ నెల 29న జరగనున్నాయని జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కలిదిండి నరసింహరాజు, ప్రధాన కార్యదర్శి సిగిలిపల్లి లక్ష్మీదేవి తెలిపారు. శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానం వేదికగా శనివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి ఎంపికల ప్రక్రియ జరుగుతుందని పేర్కొన్నారు. 2006 జనవరి ఒకటి తర్వాత జన్మించిన వారు అర్హులని తెలిపారు. పూర్తి వివరాలకు సంఘ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి ఎం.వి.రమణ (94410 11391)ను సంప్రదించాలని వారు కోరారు.

సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం



సమావేశంలో పాల్గొన్న ఒడియా మైనారిటీ సంఘం ప్రతినిధులు

ఇచ్ఛాపురం : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటామని ఆంధ్రప్రదేశ్ ఒడియా మైనారిటీ సంఘం అధ్యక్షుడు సత్యనారాయణ పాడీ అన్నారు. ఇచ్ఛాపురం పట్టణంలోని బాపూజీ ఒడియా పాఠాఘూర్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఒడియా మాతృభాషగా గల కండ్ర కులస్తులను బీసీ–డీ నుంచి బీసీ–ఏగా మార్చిన సీఎంకు, స్పీకర్, మంత్రులు, ఎమ్మెల్సీ, నియోజకవర్గ సమన్వయకర్తలకు ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పాఠాఘూర్ అధ్యక్షుడు రఘునాథ్ గౌడో, మైనారిటీ సంఘ ప్రతినిధులు శివప్రసాద్ పండా, రాజేంద్రపండా, శ్రీనివాస్‌దాస్, రఘునాథ్ శస్మాల్, కేశవబెహర పాల్గొన్నారు.

రూ.123 కోట్లతో శాశ్వత తాగునీటి సౌకర్యం

- మున్సిపల్ ఇంజినీర్లతో మంత్రి ధర్మాన సమీక్ష



మున్సిపల్ అధికారులతో మాట్లాడుతున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం రూరల్:

శ్రీకాకుళం నగర జనాభా సుమారు రెండు లక్షలు ఉందని, రానున్న ఇరవై ఏళ్లను ఉంచుకుని శాశ్వత ప్రాతిపదికన తాగునీటి సౌకర్యం కల్పించేందుకు రూ.123 కోట్లతో డీపీఆర్‌ను రూపొందించినట్లు సిస్ట్ కన్సల్టెన్సీ ప్రతినిధులు మంత్రి ధర్మాన ప్రసాదరావుకు వివరించారు. నగరాభివృద్ధికి సంబంధించి పలు అంశాలపై మంత్రి ధర్మాన బుధవారం మున్సిపల్ అధికారులతో పెదపాడులోని క్యాంపు కార్యాలయంలో సమీక్షించారు. ఇటీవల నగరంలో విలీనమైన ఏడు పంచాయతీలకు సంబంధించి తాగునీటి సౌకర్యాన్ని శాశ్వత రీతిలో అభివృద్ధి చేసేందుకు పలు సూచనలు చేశారు. వాటర్ సప్లయ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రాజెక్టుకు సంబంధించి డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టును రూపొందించిన సంస్థ ప్రతినిధులతో మంత్రి చర్చించారు.

రానున్న రోజుల్లో 16 ఎంఎల్‌టీ తాగునీరు అందించేలా డీపీఆర్ రూపొందిపరిచినట్లు చెప్పారు. ఆదివారంపేట ఎగువ ప్రాంతంలో పది ఎంఎల్‌టీలకు సంబంధించి వాటర్ వర్క్స్ జరుగుతోందని, మరో ఐదు ఎంఎల్‌టీలకు బలగలో పనులు జరుగుతున్నాయన్నారు. త్వరితగతిన వీటిని పూర్తి చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. విలీన పంచాయతీలకు రెండు పూటలా నీరు అందించేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. కేంద్ర ప్రభుత్వం తరపున అమృత్ అమలులో భాగంగా రూ.23 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. పెదపాడు పంచాయతీ పరిధిలో సమస్యాత్మకంగా ఉన్న ప్రాంతంలో ఓవర్ హెడ్ ట్యాంక్ ఏర్పాటు చేయనున్నట్లు మంత్రికి మున్సిపల్ అధికారులు వివరించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ చల్లా ఓబులేషు, మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు గంగాధర్, పబ్లిక్‌హెల్త్ ఇంజనీర్ సుగుణాకర్, చల్లా శ్రీనివాస్ పాల్గొన్నారు.

పోర్టుతో వలసలకు చరమగీతం

- అభివృద్ధికి మూలస్తంభం మూలపేట
- విలేకరులతో మంత్రి సీదిరి అప్పలరాజు



మాట్లాడుతున్న మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు

కాశీబుగ్గ: శ్రీకాకుళం అంటే మొదట గుర్తొచ్చేది వలసలేనని, ఆ పరిస్థితిని మార్చేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మూలపేట వంటి పోర్టులకు శ్రీకారం చుట్టారని రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్యశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. బుధవారం పలాసలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. సిక్కోలు వాసులు ఇక్కడే ఉపాధి పొందాలనే ఉద్దేశంతో ఇటీవల జిల్లాలో మూడు భారీ ప్రాజెక్టులకు సీఎం శంకుస్థాపన చేశారని గుర్తు చేశారు. రాబోయే రోజుల్లో మూలపేట గొప్పగా అభివృద్ధి చెందుతుందని, అభివృద్ధికి మూలస్తంభంగా మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పోర్టుతో జిల్లా ముఖచిత్రం మారి ముంబై, చెన్నై, విశాఖపట్నం వంటి నగరాలకు దీటుగా అభివృద్ధి చెందుతుందని అభిప్రాయపడ్డారు. సుమారు 35 వేల మందికి ఉద్యోగ అవకాశాలు రానున్నాయని చెప్పారు. బుడగట్లపాలెం ఫిషింగ్ హార్బర్‌తో మత్స్యకారులు చెన్నై, గుజరాత్ వంటి ప్రాంతాలకు వలసలు వెళ్లే పరిస్థితి ఉండదన్నారు. హార్బర్‌కు అనుసంధానంగా ప్రోసెసింగ్ పరిశ్రమలు వస్తాయని, జిల్లా మొత్తం ఫిష్ ఆంధ్ర ఔట్‌లెట్స్ వస్తాయని చెప్పారు. వంశధార లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ ద్వారా జిల్లాలో నీటిపారుదల రంగానికి ఆనాడు వైఎస్సార్ ఊపిరి పోస్తే దానికి కొనసాగింపుగా ఆయన తనయుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గొట్టా బ్యారేజ్ నుంచి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం ద్వారా సాగునీరు అందించి రెండు పంటలకు అవకాశం కల్పిస్తున్నారని గుర్తు చేశారు. ఉద్దానంలో నిర్మిస్తున్న రూ.700 కోట్ల వాటర్ ప్రాజెక్టు తాగునీటి అవసరాలు తీరుస్తుందన్నారు. ఉత్తరాంధ్రకు సంబంధించి సాలూరులో ఏర్పాటు చేస్తున్న ట్రైబల్ యూనివర్సిటీ గిరిజనుల అభ్యున్నతికి దోహదపడుతుందన్నారు.

చేనేత సహకార సంఘాలకు బకాయిలు చెల్లించాం

- ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి



సమావేశంలో మాట్లాడుతున్న ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): చేనేత సహకార సంఘాలకు బకాయిలు చెల్లింపులు పూర్తి చేసి నేత కార్మికులకు ప్రభుత్వం అన్నివిధాలా అండగా నిలుస్తోందని ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి అన్నారు. రాష్ట్ర వ్యాప్త పర్యటనలో భాగంగా బుధవారం ఆప్కో డైరెక్టర్ ఎ.వై.సుబ్బారెడ్డితో కలిసి శ్రీకాకుళంలో పర్యటించారు. ముందుగా ప్రజాబంధు ప్రగాఢ కోటయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల చేనేత, జౌళి శాఖ, మండల వాణిజ్య అధికారులతో సభ నిర్వహించి కార్మికుల సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేనేత పెట్టుబడులు, సామగ్రి అందజేయడమే కాకుండా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పెన్షన్ అందజేస్తున్నట్లు తెలిపారు. 2018 నుంచి శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లోని ప్రాథమిక చేనేత సహకార సంఘాలలో పనిచేస్తూ మరణించిన 98 మంది చేనేత కార్మికులకు సంబంధించి ఒక్కొక్కరికీ రూ.12,500 చొప్పున ఎక్స్‌గ్రేషియా చెక్కుల పంపిణీ చేశారు. ఈ ఎక్స్‌గ్రేషియా 2023 నుంచి రూ.25,000కు ప్రభుత్వం పెంపుదల చేసిందన్నారు. ఆప్కో ద్వారా నూలు పంపిణీ చేసేందుకు, డ్రయ్యింగ్ చార్జీలు పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. వైఎస్సార్ నేతన్న నేస్తం పథకం ప్రాథమిక చేనేత సహకార సంఘాల్లోని వర్క్‌షెడ్‌ల్లో పని చేస్తున్న కార్మికులకు కూడా వర్తించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. సమావేశంలో చేనేత, జౌళి శాఖ సహాయ సంచాలకులు ఐ.ధర్మారావు, ఆప్కో డివిజనల్ వాణిజ్యాధికారి సోమేశ్వరరావు, డీఓ శేఖర్, లీలాకుమార్ ముఖర్జీ, వివిధ సహకార ఉత్పత్తి విక్రయసంఘాల అధ్యక్షులు, మేనేజర్లు, సేల్స్‌మెన్లు పాల్గొన్నారు.

శిక్షణతో స్వయం ఉపాధి



మాట్లాడుతున్న ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రామారావు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ప్రభుత్వం అందించే శిక్షణను సద్వినియోగం చేసుకుని యువత స్వయం ఉపాధి సాధించాలని, తద్వారా పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ కె.రామారావు అన్నారు. ప్రధానమంత్రి అనుసూచిత జాతి అభ్యుదయ యోజనలో భాగంగా బుధవారం నగరంలోని బాపూజీ కళామందిర్‌లో ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలో రాగ్ పిక్కర్స్ (ప్లాస్టిక్, చెత్త, ఇతర వ్యర్థ పదార్థాలు) సేకరించిన వ్యర్థాలను గ్రేడింగు చేయడం, రీ సైక్లింగ్ వేల్యూ ఎడిషన్‌కు అమ్మడం ద్వారా అధిక ఆదాయం పొందవచ్చునని చెప్పారు. శిక్షణను యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎస్సీ కార్పొరేషన్, మెప్మా, సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రో కెమికల్స్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు రమణమూర్తి, బి.నరసింగరావు, మోహర్వాని, అర్జీ కోటి, పి.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

104 రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా లోకనాథం



బమ్మిడి లోకనాథం

కాశీబుగ్గ : సంచార 104 వాహనంలో పనిచేస్తూ పేదల ఆరోగ్యం కోసం పాటుపడుతున్న సిబ్బంది సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని 104 సంఘ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శిగా నియమితుడైన బమ్మిడి లోకనాథం బుధవారం తెలిపారు. విజయవాడలోని ఎంబీ విజ్ఞాన కేంద్రంలో 104 ఉద్యోగుల రాష్ట్ర సమావేశం నిర్వహించి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఇందులో శ్రీకాకుళం జిల్లా పలాసకు చెందిన బమ్మిడి లోకనాథంను రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించారు.

శాస్త్రీయకోణంలో దర్యాప్తు చేపట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ రాధిక

శ్రీకాకుళం క్రైమ్ : సాంకేతిక పరిజ్ఞానాన్ని అనుసరించి సైబర్ కేసుల దర్యాప్తులో నైపుణ్యం పెంపొందించుకుని శాస్త్రీయ కోణంలో దర్యాప్తు చేయాలని ఎస్పీ జి.ఆర్.రాధిక అన్నారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో సైబర్ నేరాల దర్యాప్తు, కేసుల ఛేదన, ముద్దాయిల అరెస్టు తదితర అంశాలపై సీఐలతో సమీక్ష నిర్వహించారు. ముందుగా ఓటీపీ, కేవైసీ, జాబ్, లోన్‌యాప్స్, ఆధార్ ఎనేబుల్డ్, ఫేక్ కస్టమర్‌కేర్ ఫ్రాడ్స్ వంటి సైబర్ కేసుల దర్యాప్తులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సైబర్ నేరాలు– నివారణా చర్యలపై ప్రతి పోలీసు అధికారి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ తరహా నేరాల్లో మొబైల్ ఫోన్ కీలకంగా మారుతుందన్నారు. బ్యాంకు అకౌంట్లలో నగదు పోగొట్టుకున్న బాధితులు ముందుగా టోల్‌ఫ్రీ నంబర్ 1930కు కాల్ చేసి సంబంధిత బ్యాంకుకు వెళ్లి ఫిర్యాదు చేసేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ (క్రైమ్) టి.పి.విఠలేశ్వర రావు, డీఎస్పీలు మహేంద్రమాతే, ఎం.శివరామిరెడ్డి, సీఐలు బి.ప్రసాదరావు, పి.శ్రీనివాస రావు, ఎల్.సన్యాసినాయుడు, ఆర్‌సీహెచ్.ఈశ్వరప్రసాద్, రవిప్రసాద్, శ్రీనివాసరావు, సైబర్ సెల్ ఎస్ఐ ప్రసాదరావు, ఏఎస్ఐ రమేష్, పీఆర్వో భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీలో డ్రైవింగ్ శిక్షణ ప్రారంభం



అభ్యర్థికి ట్రైనింగ్ బుక్ అందజేస్తున్న డీఎం మాధవ్

శ్రీకాకుళం అర్బన్: ఆర్టీసీలో డ్రైవింగ్ శిక్షణ భవిష్యత్తుకు బంగారు బాట అని శ్రీకాకుళం ఒకటో డిపో మేనేజర్ కె.మాధవ్ అన్నారు. ఏపీఎస్‌ఆర్టీసీ హెవీ డ్రైవింగ్ స్కూల్‌లో 12వ బ్యాచ్‌ను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు సుమారు 200 మంది అభ్యర్థులు శిక్షణ తీసుకున్నారని, వారిలో చాలామంది ఉపాధి అవకాశాలు పొంది స్థిరపడ్డారన్నారు. ఆర్టీసీతో పాటు మిగతా డిపార్ట్‌మెంట్లలో ఉద్యోగ అవకాశాలు ఉంటాయన్నారు. తదుపరి బ్యాచ్ వివరాల కోసం 9963091999, 7382921920 నంబర్లను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్టీసీ డ్రైవింగ్ ఇన్‌స్ట్రక్టర్ వర్మ పాల్గొన్నారు.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	55,950–00
బంగారం(22సి. 10గ్రా.)	61,040–00
వెండి (కిలో)	80,200–00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 450.00
విజయనగరం	రూ. 454.00
శ్రీకాకుళం	రూ. 454.00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹120	₹195	₹ 215

అవయవదానం స్ఫూర్తిదాయకం



కిరణ్‌చంద్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, సాయిరాజ్

సోంపేట: బిడ్డ అవయదానం చేసి మీరు చూపించిన స్ఫూర్తి చిరస్మరణీయమని అవయదాత ఎం.కిరణ్‌చంద్ తల్లిదండ్రులను జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ, సమన్వయకర్త పిరియా సాయిరాజ్ అభినందించారు. సోంపేటలో కిరణ్‌చంద్ తల్లిదండ్రులు మోహన్, గిరిజా కల్యాణిలను బుధవారం కలిసి సంతాపం తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిడ్డ మృతిచెందాడన్న బాధను తట్టుకుని తీసుకున్న నిర్ణయం ఎందరికో స్ఫూర్తినిచ్చిందన్నారు. ప్రభుత్వం తరఫున సహాయ సహకారాలు అందించడానికి తమ వంతు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్, శిలగాన భాస్కరరావు, శ్రీను, నెహ్రూ, క్రాంతి శ్రీను తదితరులు పాల్గొన్నారు. కిరణ్‌చంద్ కుటుంబ సభ్యులను కేజీహెచ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉలాల కోదండరామ్ పరామర్శించి సంతాపం తెలియజేశారు. ఆయనతో పాటు గోవింద రాజులు, మద్దు సోమశేఖర్ ఉన్నారు.

పక్కదారి పడుతున్న అంగన్‌వాడీ సరుకులు



సిబ్బందిని ప్రశ్నిస్తున్న గొండు సీతారాం

పొందూరు: అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు, గర్భిణులకు, బాలింతలకు అందించాల్సిన సరుకులు పక్కదారి పడుతున్నట్లు రికార్డుల పరిశీలనలో వెల్లడవుతుండడం అధికారుల పర్యవేక్షణ లోపాన్ని తేటతెల్లం చేస్తోందని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు డాక్టర్ గొండు సీతారాం అన్నారు. పొందూరు మండలం కింతలిలో అంగన్‌వాడీ–1, అంగన్‌వాడీ–3 కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీలు చేశారు. పిల్లలు రాకపోయినా హాజరైనట్లు లెక్కల్లో చూపడం, వీరికి పౌష్టికాహారం అందిస్తున్నట్లు చూపడంపై విస్మయం చెందారు. పక్క ఇంట్లో వండిన పదార్థాలను తీసుకొచ్చి వడ్డించే ప్రయత్నంపైనా ఆగ్రహం వ్యక్తం చేశారు. సూపర్‌వైజర్ జీవీ రత్నం సెంటర్లు పరిశీలించిన దాఖలాలు లేకపోవడం గుర్తించారు. రికార్డుల నిర్వహణ సక్రమంగా లేకపోవడం, ఈ నెల 30 వరకు విద్యార్థుల హాజరు, సరుకుల పంపిణీకి సంబంధించిన చార్టులో అందినట్లు వివరాలు పొందపరచడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బాలల హక్కులకు, సంక్షేమానికి భంగం వాటిల్లితే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. తనిఖీల్లో పంచాయతీ సెక్రటరీ సారంగి నాగరాజు, వార్డు మహిళా సంరక్షణాధికారి పైడి అశ్విని, సీఆర్‌పీఎఫ్ కన్వీనర్ కొత్తకోట శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు ఘటనల్లో ముగ్గురి మృతి



బాబూరావు మృతదేహం

టెక్కలి రూరల్ : స్థానిక మండపాలం కాలనీకి చెందిన నెయ్యిల బాబూరావు(30) బుధవారం హైదరాబాద్‌లో విద్యుత్ షాక్‌తో మృతిచెందాడు. కొన్నాళ్లుగా పెయింటింగ్ పనులు చేస్తున్న బాబూరావు బుధవారం ఓ కళాశాల భవనానికి రంగు వేస్తుండగా పైనున్న విద్యుత్ తీగలకు తగిలి షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. ఇతనికి భార్య యమున, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఇంటి పెద్ద దిక్కు కోల్పోవడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా రోదిస్తున్నారు.

పొట్టిశ్రీరాములు కూడలిలో..



ఆనందరావు మృతదేహం

శ్రీకాకుళం క్రైమ్ : పట్టణంలోని పొట్టి శ్రీరాములు కూడలి సమీపంలో మందుల దుకాణం వద్ద ఓ వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందినట్లు ఒకటో పట్టణ ఎస్ఐ బలివాడ గణేష్ తెలిపారు. కిల్లిపాలెం గ్రామానికి చెందిన మెరకాన ఆనందరావు (47) లేబర్ పనులు చేస్తూ వచ్చే డబ్బులతో మద్యానికి అలవాటు పడి మూడురోజులకు, వారంరోజులకోసారి ఇంటికి వెళ్తూ నిత్యం బయటే గడిపేవాడు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి మెడికల్‌షాపు వద్ద మృతిచెందాడు. ఈయనకు భార్య లావణ్య, కుమారుడు ప్రసాద్ ఉన్నారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

సత్యసాయి మందిరం వద్ద..



వృద్ధుడి మృతదేహం

శ్రీకాకుళం క్రైమ్ :అరసవిల్లి సూర్యనారాయణ స్వామి గుడి సమీపంలోని సత్యసాయి సేవా సమితి మందిరం మెట్లపై ఓ వృద్ధుడు మృతి చెందినట్లు స్థానిక వీఆర్వో కొయ్యాన లీలా ప్రసన్న ఫిర్యాదు ఇవ్వడంతో కేసు నమోదు చేసినట్లు ఒకటో పట్టణ ఎస్ఐ బలివాడ గణేష్ తెలిపారు. వృద్ధుని జేబులో ఆధార్‌కార్డును చూడగా అల్లంశెట్టి ముకుందరావు, సోంపేట టౌన్, మెయిన్‌స్ట్రీట్ అని ఉందని చెప్పారు. బంధువులకు సమాచారం అందించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

పక్కాగా పథకాల అమలు

శ్రీకాకుళం అర్బన్: జిల్లా స్త్రీ, శిశు సంక్షేమశాఖలో అమలు చేస్తున్న ప్రభుత్వ పథకాలను ప్రతి ఒక్క సీడీపీవో సక్రమంగా అమలు చేయాలని ఐసీడీఎస్ పీడీ జి.జయదేవి అన్నారు. శ్రీకాకుళం ఐసీడీఎస్ కార్యాలయంలో బుధవారం సీడీపీఓలతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో సీడీపీవోలు, అంగన్‌వాడీ అధికారులు పాల్గొన్నారు.